సాక్షి
మెదక్
మంగళవారం । 21 । జనవరి । 2025



కొండపోచమ్మ బాట పట్టి

కొమురెల్లి మల్లన్నను దర్శించుకున్న భక్తులు.. కొండపోచమ్మ బాట పట్టారు.

వివరాలు 8లో ▸



తాళం వేసిన ఇంట్లో చోరీ

టేక్మాల్ మండలం ఎక్లాస్‌పూర్‌లో పట్టపగలే తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది.

వివరాలు 8లో ▸



ఆస్పత్రిలో వసతులు ఏవి ?

పేరుకే పెద్దశంకరంపేట ప్రభుత్వానుపత్రి. సరైన వసతులు కరువై రోగులు ఇబ్బంది పడుతున్నారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

అడవుల సంరక్షణపై శిక్షణ



అర్బన్ పార్కులో అటవీశాఖ అధికారులు

నర్సాపూర్: అడవుల సంరక్షణతో పాటు క్షేత్ర స్థాయి పరిశోధనపై జిల్లాకు చెందిన అటవీ శాఖ అధికారులు, సిబ్బందికి సోమవారం రైతు వేదికలో శిక్షణ ఏర్పాటుచేశారు. అటవీశాఖ డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ప్రకాష్, డీఎఫ్ఓ జోజి అడవుల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం అర్బన్ పార్కులో ఫీల్డ్ విజిట్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక ఎఫ్ఆర్ఓ అరవింద్, సెక్షన్ ఆఫీసర్ సాయిరాం పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి: జాన్ కెన్నడీ



నర్సాపూర్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఐకేపీ జిల్లా సంస్థాగత నిర్మాణ విభాగం ప్రాజెక్టు మేనేజర్ జాన్ కెన్నడీ హితవు పలికారు. సోమవారం ఐకేపీ కార్యాలయంలో గ్రామ సంఘాల అధ్యక్షులు, సీఏల శిక్షణ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సంఘాల నాయకత్వ మార్పులు, కాలపరిమితి, గ్రామ సంఘాలు, మండల సమాఖ్య బాధ్యుల విధులు, బాధ్యతలు తదితర అంశాలపై ఆయన మహిళా ప్రతినిధులకు అవగాహన కల్పించారు. సమావేశంలో ఐకేపీ ఏపీఎం గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవలో ముందుండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్): ప్రజలకు సేవ చేయడంలో పరిశ్రమల యాజమాన్యాలు ముందుండాలని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రంగాయపల్లి, చెట్లగౌరారం శివారులో గల ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీఎస్ఆర్ నిధులతో గ్రామాలకు చేయూతనివ్వాలి కోరారు. అనంతరం అవసరమైన వారికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తూప్రాన్ సీఐ రంగాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి కవిత, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

బేటి బచావో- బేటి పడావో'పై అవగాహన కల్పించాలి

మెదక్ కలెక్టరేట్: 'బేటి బచావో బేటి పడావో' కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని, పథకం ప్రారంభమై పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఉత్సవాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సంబంధిత శాఖలతో సమన్వయం ఏర్పాటు చేసుకుని ఆడపిల్లల సంక్షేమానికి సమాజంలో చైతన్యం తీసుకురావాలని సూచించారు. గ్రామాల్లో తరచూ ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలకు చట్టపరమైన సంరక్షణ కల్పించాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే జరిమానాతో పాటు జైలు శిక్షపై ప్రజలకు వివరిస్తూ బాలిక సాధికారత దిశగా జిల్లాను మొదటి స్థానంలో నిలపాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జితేందర్, జిల్లా మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి హైమావతి, అదనపు ఎస్పీ మహేందర్, డీఆర్డీఓ శ్రీనివాసరావు, డీఎంహెచ్ఓ శ్రీరామ్, సీడీపీఓలు, సఖి, మహిళా సాధికారత సభ్యులు పాల్గొన్నారు.

పూత.. దిగుబడిపై ఆశ

విరగబూసిన మామిడి

- తెగుళ్ల ముప్పుతో రైతుల దిగులు
- అప్రమత్తత అవసరమని అధికారుల సూచన
- జిల్లాలో 3వేల పైచిలుకు ఎకరాల్లో తోటలు

ఎప్పుడూ లేని విధంగా ఈసారి మామిడి పూత విరగబూసింది. అయితే వివిధ రకాలు తెగుళ్లు రైతులను కలవరపెడుతున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి తోటల పెంపకం చేపట్టిన కర్షకులు తెగుళ్ల భారి నుంచి చెట్లను రక్షించుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇందుకోసం వివిధ రకాల పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. పూత నిలబడితేనే దిగుబడి పెరుగుతుందని ఆశిస్తున్నారు.



హవేళిఘణాపూర్: కూచన్‌పల్లిలోని ఓ మామిడి తోటలో విరగబూసిన పూత

మెదక్‌జోన్: జిల్లావ్యాప్తంగా మూడు వేల పైచిలుకు ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. వాతావరణ మార్పులతో పాటు అకాల వర్షాలు, గాలివానతో గడిచిన మూడేళ్లు రైతులు నష్టాలనే చవి చూశారు. కాగా ఈసారి ఎప్పుడూ లేని విధంగా మామిడి పూత విరగబూసింది. కానీ రాత్రి వేళల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడం, రసం పీల్చే పురుగుతో పాటు బూడిద తెగులు రైతులను కలవరపెడుతున్నాయి. దీంతో పూత, కాత రాలిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెగుళ్ల నివారణ కోసం వారికి తోచిన మందులను పిచికారీ చేస్తున్నారు. వారం రోజుల్లో తెగుళ్ల నుంచి తోటలను కాపాడుకోకుంటే దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే వరి ఇతర కూరగాయల మాదిరిగా కాకుండా మామిడి పూత పలు దఫాలుగా వస్తోంది. ఇది ముఖ్యంగా డిసెంబర్ మూడో వారం నుంచి మొదలుకుని ఫిబ్రవరి మూడో వారం వరకు పలుమార్లు రానుంది. ఏప్రిల్ మొదటి వారం నుంచి మొదలుకుని జూన్ చివరి వారం వరకు కాత వస్తుంది. అంటే ఏడాదిలో ఐదు మాసాల వరకు మామిడి పంట ప్రక్రియ కొనసాగుతోంది. కాగా జనవరి, ఫిబ్రవరిలో సోకే తెగుళ్ల నివారణ కోసం సకాలంలో చర్యలు చేపడితే మంచి దిగుబడులు వస్తాయని ఉద్యానవనశాఖ అధికారులు చెబుతున్నారు.

ఎకరాకు రూ. లక్ష ఆదాయం

తెగుళ్ల ముప్పు నుంచి మామిడి తోటలను కాపాడుకుంటే ఎకరాకు రూ. 75 వేల నుంచి రూ. లక్ష వరకు ఆదాయం వస్తోందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఎకరంలో మూడు నుంచి నాలుగు టన్నుల మామిడి కాయల దిగుబడి వస్తుందంటున్నారు. టన్ను మామిడి కాయలకు హోల్‌సేల్ ధర రూ. 25 వేల వరకు ఉంటుందని, ఈ లెక్కన ఎకరంలో సదరు రైతు ఆదాయం రూ. లక్ష వరకు వచ్చే అవకాశం ఉంది. టంకర చేసే మరింత అదాయం రానుంది. మామిడి కాయలను కోసం మగ్గబెట్టి విక్రయిస్తే ఎకరాకు రూ. లక్ష వరకు ఆదాయం వస్తే, మామిడి కాయలను కోసి టంకరగా మార్చి విక్రయిస్తే ఎకరానికి రూ. 2 లక్షల మేర ఆదాయం వరకు వస్తోందని రైతులు చెబుతున్నారు. ఎక్కువగా మెదక్, కొల్చారం, చిన్నశంకరంపేట, రామాయంపేట, హవేళిఘణాపూర్ తదితర మండలాల రైతులు మాత్రమే టంకరను తయారు చేస్తారు.

అప్రమత్తంగా ఉండాలి

ప్రస్తుతం మామిడి తోటలు విరగబూశాయి. అయితే తోటలకు రసం పీల్చే పురుగు, బూడిద తెగులు ఆశించింది. ఈ సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. తెగుళ్ల నివారణ కోసం 20 లీటర్ల నీటిలో ఒక గ్రాము ఇమిడక్లోరైడ్, రెండు గ్రాముల సాఫ్‌తో పాటు 19-19-19ను 5 గ్రాముల చొప్పున నీటిలో కలిపి పూతపై 10 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.

– ప్రతాప్‌సింగ్, జిల్లా ఉద్యానశాఖ అధికారి

రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

- గ్రామ సభల్లో దరఖాస్తులు స్వీకరించాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్‌జోన్: రేషన్ కార్డుల జారీ నిరంతర పక్రియ అని, అర్హులకు కార్డు మంజూరు కాకుంటే గ్రామ సభల్లో దరఖాస్తులు స్వీకరించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఇప్పటివరకు చేపట్టిన క్షేత్రస్థాయి సర్వే పరిశీలన, గ్రామ, వార్డు సభల నిర్వహణపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు భరోసా పథకం గుర్తింపులో ఎలాంటి తప్పిదాలకు తావివ్వొదని సూచించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లతో పాటు ఇతర పథకాల విషయంలో అర్హులను గుర్తించాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి అధికారులపై ఉందని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, జిల్లా పౌర సరఫరాల అధికారి సురేష్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఆ భూములకు రైతు భరోసా వర్తించదు

టేక్మాల్(మెదక్): సాగు యోగ్యం కాని భూములకు రైతు భరోసా వర్తించదని కలెక్టర్ స్పష్టం చేశారు. సోమవారం టేక్మాల్‌లో వివిధ పథకాల కోసం చేపడుతున్న సర్వేను పరిశీలించి మాట్లాడారు. రెవెన్యూ, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. గ్రామ సభల నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు తహసీల్దార్ తులసీరాం, ఎంపీడీఓ విఠల్, వ్యవసాయాధికారి రాంప్రసాద్, ఆర్ఐ సాయి శ్రీకాంత్, ఈఓ రాకేష్ తదితరులు ఉన్నారు.



అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్

ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దు



రేషన్ కార్డుల సర్వేను పర్యవేక్షిస్తున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

ఆర్డీఓ జయచంద్రారెడ్డి

తూప్రాన్: సర్వేలో అధికారులు ఎలాంటి తప్పులు, పొరపాట్లు లేకుండా నిజమైన అర్హులను గుర్తించాలని ఆర్డీఓ జయచంద్రారెడ్డి సిబ్బందికి సూచించారు. సోమవారం పట్టణ పరిధిలోని తాతపాపన్‌పల్లిలో రేషన్ కార్డుల సర్వేను మున్సిపల్ చైర్ పర్సన్ జ్యోతితో కలిసి పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామని స్పష్టం చేశారు. కుటుంబ సర్వేలో రేషన్ కార్డులు లేవని చెప్పిన వారికి కార్డుల జారీ కోసం విచారణ పూర్తి అయిందని తెలిపారు. కొత్త కోడలు, పిల్లలను తమ కార్డులో చేర్చమని గతంలో మీ సేవలో దరఖాస్తు చేసుకున్న 7,700 దరఖాస్తులను కూడా తమ డివిజన్ పరిధిలో విచారణ చేస్తున్నామని చెప్పారు. అంతే కాకుండా గతంలో ప్రజాపాలనలో రేషన్ కార్డు కావాలని ఇచ్చిన దరఖాస్తులను కూడా విచారణ చేస్తామని తెలిపారు. తూప్రాన్ డివిజన్ పరిధిలో ఇప్పటివరకు 5,786 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. కాగా కుటుంబ సర్వేలో, ప్రజాపాలనలో ఎలాంటి దరఖాస్తు చేయని వారు ప్రస్తుతం గ్రామ, వార్డు సభలలో కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

• బడి తోట.. భలే పంట



చందాపూర్ పాఠశాలలో ఆకుకూరల సాగు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందాపూర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి బడి తోట నిర్వహిస్తున్నారు. పాలకూర, తోటకూర, మెంతికూర, గంగవాయిలి కూర, కొత్తిమీరా సాగు చేస్తున్నారు. సేంద్రియ విధానంలో సాగు చేసిన ఆకుకూరలు ఏపుగా పెరగడంతో వారంలో రెండు రోజులు విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో వడ్డిస్తున్నారు.

పైరవీలకు తావు లేదు

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



అర్జీలు పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: ఏమైనా సమస్యలుంటే మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా వచ్చి పరిష్కరించుకోవాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ప్రజలకు సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ఈసందర్భంగా బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ అధికారులతో మాట్లాడారు. సమస్య స్థితిని, పరిష్కారానికి పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా పోలీస్ సేవలను వినియోగించుకోవాలన్నారు. సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకోవాలని తెలిపారు. శాంతి భద్రతలను పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్‌శాఖ పని చేస్తుందని పేర్కొన్నారు.

మల్లన్న క్షేత్రం.. బండారు మయం

- కొమురవెల్లిలో వైభవంగా పెద్దపట్నం, అగ్నిగుండాలు
- తరించిన భక్తకోటి



పసుపు బండారితో శిగమూగుతున్న భక్తురాలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న క్షేత్రం పసుపువర్ణ శోభితమైంది. పట్నం వారం సందర్భంగా సోమవారం తోటబావి ప్రాంగణంలో పెద్దపట్నం, అగ్నిగుండాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. పంచవర్ణాల పెద్ద పట్నాన్ని దాటుకుంటూ.. అగ్నిగుండంలో నడుస్తూ మేడలమ్మ, కేతమ్మ సమేత మల్లికార్జునుడిని దర్శించుకుని భక్తులు తన్మయత్వం పొందారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు హైదరాబాద్‌కు చెందిన మానుక పోచయ్య యాదవ్ కుటుంబ సభ్యులు, దుర్గాప్రసాద్‌యాదవ్, యాదవ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో పెద్దపట్నం, అగ్నిగుండాలను నిర్వహించారు. శివసత్తులు, భక్తులు బండారు చల్లుకోవడంతో ఆలయ పరిసరాలు పసుపుమయమయ్యాయి.

21 వరుసలతో పెద్దపట్నం..

హైదరాబాద్ యాదవసంఘం ఒగ్గుపూజారులు పంచవర్ణాలతో 21 వరుసలతో పెద్దపట్నం వేశారు. అదే సమయంలో భగభగ మండే నిప్పు రవ్వలతో అగ్నిగుండం తయారు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

మా సమస్యలు పరిష్కరించండి

మెదక్ కలెక్టరేట్: విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్లను వెంటనే కన్వర్షన్ చేయాలని టీవీఏసీజాక్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ డివిజన్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు ప్రారంభించారు. ఈసందర్భంగా జాక్ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నేటి నుంచి ఈనెల 25 వరకు రిలే దీక్షలు, నిరసనలు తెలపనున్నట్లు తెలిపారు. ఏళ్ల తరబడి వెట్టి చాకిరి చేస్తున్నా.. పనికి తగిన వేతనం లభించడం లేదన్నారు. తాము కొత్తగా ఏమి అడగడం లేదని, ఉన్న పోస్టులను కన్వర్షన్ చేసి రెగ్యులర్ చేయాలన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఒక విద్యుత్‌శాఖలోనే రెండు రూల్స్ ఉండటం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో విద్యుత్ కార్మిక సంఘాల నాయకులు స్వామి, దుర్గేష్, నాగరాజు, కొండల్‌రెడ్డితో పాటు పెద్దసంఖ్యలో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ కార్యాలయం ఎదుట ఆర్టిజన్ల నిరసన

దివ్యాంగులకు పెన్షన్ పెంచాలి

మెదక్ కలెక్టరేట్: దివ్యాంగుల పెన్షన్ రూ. 5 వేలకు పెంచాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శి యశోద ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెన్షన్ పెంపుపై ఫిబ్రవరి 10న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను సోమవారం మెదక్‌లో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దివ్యాంగులకు రేషన్ కార్డు ఇవ్వాలని, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, ఉపాధి హామీ పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్డీ వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గ, జిల్లా కమిటీ సభ్యులు భాగ్యలక్ష్మి, రాణి తదితరులు పాల్గొన్నారు.

తక్షణ పరిష్కారం చూపండి



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

- అదనపు కలెక్టర్ నగేష్
- ప్రజావాణికి 102 వినతులు

మెదక్ కలెక్టరేట్: ప్రజావాణిలో వినతులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి వెంటనే పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న అర్జీలను సైతం వెంట వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ప్రజావాణికి 102 వినతులు రాగా వాటిలో అత్యధికంగా ధరణి సమస్యలపై 38, ఇందిరమ్మ ఇళ్ల కోసం 11, రుణమాఫీపై 3, రేషన్ కార్డులు కావాలని 10, ఇతర సమస్యలపై 40 వరకు వచ్చాయి. ప్రజావాణి కార్యక్రమంలో డీఆర్ఓ భుజంగరావు, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్డీఓ పీడీ శ్రీనివాసరావుతో పాటు అన్నిశాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిహారమిచ్చి ఆదుకోండి



పొలం వద్ద పనులు చేస్తుండగా పిడుగుపాటుతో మా తండ్రి ఇమ్మడి రాజయ్య గతేడాది సెప్టెంబర్ 4వ తేదీన మృతి చెందాడు. కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించి ఆదుకోవాలి. – గణేష్, వాడి, హవేళిఘణాపూర్

రుణమాఫీ కావడం లేదు



లక్ష్మాపూర్ ఏపీజీవీబీ బ్యాంకులో లక్షలోపు పంట రుణం తీసుకున్నాం. మాకు ఇప్పటివరకు రుణమాఫీ కాలేదు. ప్రభుత్వం రూ. రెండు లక్షలలోపు బకాయిలను మాఫీ చేస్తున్నట్లు ప్రకటించింది. కాని లక్షలోపు ఉన్న మా రుణం మాత్రం మాఫీ కాలేదు. ఇప్పటికైనా రుణమాఫీ చేసి ఆదుకోండి.

– రాగుల సిద్దమ్మ, లక్ష్మాపూర్

పొలం ఆక్రమించారు



బతుకుదెరువు కోసం పట్నం పోతే.. మా పొలాన్ని ఆక్రమించుకొని అన్యాయం చేస్తున్నారు. మెదక్ మండలం అవుసులపల్లి శివారులోని 573 సర్వే నంబర్‌లో రెండెకరాలను 1979లో అప్పటి ప్రభుత్వం మా తండ్రి పోచయ్య పేరున పట్టా చేసి ఇచ్చింది. నాటి నుంచి మా ఆధీనంలోనే ఆ భూమి ఉంది. కొంతకాలంగా మేము బతుకుదెరువు నిమిత్తం పట్నం వెళ్లగా గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు మా భూమి ఆక్రమించుకున్నారు. అధికారులు న్యాయం చేయాలి. – గాయంతి సాయిలు, అవుసులపల్లి

ఆగని బస్సులు.. తప్పని తిప్పలు



చిల్పెర ఐబీ చౌరస్తా వద్ద స్టేజీ దాటి ఆగిన బస్సు



అల్లాదుర్గం స్టేజీ వద్ద బస్సుల కోసం ప్రయాణికుల పడిగాపులు

స్టేజీల వద్ద బస్సులు ఆగకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అల్లాదుర్గం, చిల్పెర ఐబీ చౌరస్తా నుంచి నిత్యం వందలాది మంది ఇతర ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ప్రభుత్వం ఉచిత ప్రయాణం కల్పించడంతో రద్దీ పెరిగింది. నారాయణఖేడ్, సంగారెడ్డి, హైదరాబాద్ డిపోలకు చెందిన బస్సులను పలు స్టేజీల వద్ద డ్రైవర్లు ఆపడం లేదు. అల్లాదుర్గం దాటిన తర్వాత సర్వీస్ రోడ్డు నుంచి వెళ్లాల్సి ఉండగా, 161 హైవే పైనుంచే వెళ్తున్నారు. ఆర్టీసీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– అల్లాదుర్గం(మెదక్)

క్లుప్తంగా

గోవుల రవాణా అడ్డగింత


వాహనాన్ని పట్టుకున్న సభ్యులు

ములుగు(గజ్వేల్) : గోవులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని ములుగు వద్ద బజరంగ్ దళ్ సభ్యులు సోమవారం అడ్డుకున్నారు. కొందరు హైద్రాబాద్ వైపు గోవులను తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న సభ్యులు 34 గోవులతో వెళ్తున్న వాహనాన్ని పట్టుకుని ములుగు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గోవులను తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బజరంగ్ దళ్ సభ్యులు శ్రీకాంత్, భూచక్రం, వెంకటేష్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బైకు, సెల్‌ఫోన్ కోసమే హత్య

- తాలెల్మ హత్య కేసును ఛేదించిన పోలీసులు
- ఇద్దరు నిందితుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ అనిల్‌కుమార్

జోగిపేట(అందోల్): తాలెల్మ గట్టుమీద 11న జరిగిన యువకుడి హత్య కేసును జోగిపేట పోలీసులు ఛేదించారు. బైక్, సెల్‌ఫోన్‌ల కోసమే దారుణానికి పాల్పడినట్లు సీఐ అనిల్ కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక సీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కేసు వివరాలను వెల్లడించారు. జోగిపేట రిక్షా కాలనీకి చెందిన సద్దాం హుస్సేన్, అతడి బావమరిది తాడ్‌దాన్‌పల్లి గ్రామానికి చెందిన యూనూస్ మర్వెల్లి వైన్స్ సమీపంలో శ్రీనివాస్‌ను రెండుసార్లు కలవగా పరిచయం ఏర్పడింది. 11న మళ్లీ కలుసుకొని సెల్‌ఫోన్‌లో లూడో గేమ్ ఆడుతుండగా ఎవరు గెలిస్తే వారు పార్టీ ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. శ్రీనివాస్ గెలవడంతో ముగ్గురూ రెండు బైకులపై మర్వెల్లిలోని వైన్స్‌కు వెళ్లి మద్యం తీసుకొని తాలెల్మ రోడ్డుకు వంద మీటర్ల దూరంలోని గట్టుప్రాంతానికి వెళ్లి తాగారు. ఇదే సమయంలో శ్రీనివాస్‌కు చెందిన బైకు, ఫోన్‌ను దొంగిలించాలన్న ఉద్దేశ్యంతో మద్యం బాగా తాగించారు. అనంతరం బాటిల్‌ను పగులగొట్టి గొంతుకోసి, దగ్గరలోని బండరాయితో ముఖంపై బలంగా కొట్టి హత్య చేశారు. మృతుడి సెల్‌ఫోన్, బైకును తీసుకొని హుస్సేన్ హైదరాబాద్‌కు, సద్దాం జోగిపేటకు వెళ్లిపోయారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించి సద్దాం ఇంటికెళ్లి అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి సెల్‌ఫోన్‌ను బైక్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. ఏఎస్ఐ గౌస్, పోలీసు సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు.

15 ఎకరాలు అగ్నికి ఆహుతి

ప్రమాదవశాత్తు కొండపాక అటవీ ప్రాంతంలో మంటలు


మంటలార్పుతున్న ఫారెస్టు అధికారులు

కొండపాక(గజ్వేల్): కొండపాక శివారులోని ఆనంద నిలయం సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో సోమవారం ప్రమాదవశాత్తు పెద్ద ఎత్తున మంటలు అంటుకున్నాయి. అటుగా వెళ్తున్న కొందరు ఈ విషయమై ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ ఇక్రముద్దీన్, సెక్షన్ ఆఫీసర్ రమేశ్, సిద్దిపేట డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పద్మ, కుకునూరుపల్లి సెక్షన్ ఆఫీసర్ ముజిబుద్దీన్, బీట్ ఆఫీసర్ చంద్రశేఖర్, జ్యోతి, రవి, కిరణ్ చెట్ల కొమ్మలతో సుమారు 2 గంటల పాటు శ్రమించి మంటలార్పివేశారు. సుమారు 15 ఎకరాల అటవీ ప్రాంతం మంటలకు ఆహుతి అయినట్లు తెలిపారు. దారి వెంట అటుగా వెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్, బీడీ లాంటివి తాగి అటవీ ప్రాంతంలో ఆర్పకుండా పడేయడంతో మంటల వ్యాపించాయని ఫారెస్టు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు.

మల్లన్నకు మొక్కి.. కొండపోచమ్మ బాట పట్టి

- తరలివచ్చిన వేలాది మంది భక్తులు
- ప్రారంభమైన కొండపోచమ్మ జాతర
- అమ్మవారిని దర్శించుకున్న జిల్లా జడ్జి శ్రావణి


కొండపోచమ్మకు వస్తున్న వాహనాలు


కొండపోచమ్మ ఆలయంలో భక్తుల బారులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్‌నర్సాపూర్ గ్రామ సమీపంలో గల శ్రీ కొండపోచమ్మ జాతర ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమైంది. అమ్మ పోచమ్మతల్లి కరుణించమ్మా.. మొక్కులు తీర్చాలని అమ్మవారికి మొక్కుకున్నారు.. పట్నం వారం కావడంతో సోమవారం కొండపోచమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

భారీగా వాహనాలు..

కొండపోచమ్మకు వచ్చే భక్తులు కొత్త కుండల్లో నైవేద్యం వండి బోనాన్ని తయారు చేశారు. అనంతరం మహిళలు బోనాలను నెత్తిన ఎత్తుకొని డప్పు చప్పుళ్ల మధ్య నృత్యం చేస్తూ అమ్మవారి చెంతకు చేరుకొని అమ్మవారికి సమర్పించి ఆశీస్సులు పొందారు. అలాగే తల్లి పోచమ్మకి వడి బియ్యం పోయడానికి భక్తులు పోటీ పడ్డారు. పోలీసులు దగ్గరుండి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. జాతరలో భాగంగా ఆలయం నుంచి ఎల్లమ్మ దేవాలయం వరకు భక్తుల తాకిడి పెరిగింది. కొమురెల్లి నుంచి భారీ వాహనాలతో కొండపోచమ్మకు బయలు దేరారు. సోమవారం వేలాది మంది భక్తులు కొండపోచమ్మకు చేరుకున్నట్లు ఈఓ రవి కుమార్ తెలిపారు.

అమ్మవారిని దర్శించుకున్న జిల్లా జడ్జి

సోమవారం మధ్యాహ్నం జిల్లా ఒకటవ సెషన్ జడ్జి శ్రావణి కుటుంబ సభ్యులతో కలిసి కొండపోచమ్మను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అమ్మవారికి మొక్కుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రసాదంతో సారెతో సన్మానించారు.


అమ్మవారిని దర్శించుకున్న జిల్లా జడ్జి శ్రావణి

కొమురెల్లి టు కొండపోచమ్మ...

కొమురెల్లి మల్లన్నను దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నం నుంచి కొండపోచమ్మను దర్శించుకోవడానికి బారులు తీరారు. మల్లన్న ఆలయం వద్ద పెద్దపట్నం, అగ్ని గుండాలను పూర్తి చేసుకొని భక్తులు వాహనాల్లో సాయంత్రం కొండపోచమ్మకు తరలివచ్చారు. ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఎక్కడ ట్రాఫిక్ జామ్ కాకుండా చెక్ పోస్టుల ద్వారా చర్యలు తీసుకున్నారు.

పట్టపగలే తాళం వేసిన ఇంట్లో చోరీ


విచారణ చేస్తున్న ఎస్ఐ రాజేశ్

రూ.5.20 లక్షలు అపహరణ

టేక్మాల్(మెదక్): పట్టపగలే తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన టేక్మాల్ మండలంలోని ఎల్లాస్‌పూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నీరూడి నర్సింలు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే ఉదయం ఇంటికి తాళం వేసి, తాళం చెవిని కిటికిలో పెట్టి నాటు వేసేందుకు పొలం వద్దకు వెళ్లాడు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో నర్సింలు ఇంటికొచ్చి తాళం తీసి చూడగా దొంగలు పడ్డట్లు గుర్తించారు. ఓ గదిలో బకెట్‌లో ఉన్న రూ.2 లక్షలు, ప్యాంట్‌లో ఉన్న రూ.50 వేలు, నర్సింలు కుమారుడు శ్రీకాంత్ గదిలో బీరువాలోని రూ.2.70 లక్షలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. బాధితుడు నర్సింలు టేక్మాల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ రాజేశ్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. అనంతరం మెదక్ నుంచి క్లూస్‌టీం రప్పించి విచారణ చేశారు.


బ్యాటరీలను చూపుతున్న ఎస్ఐ

ఆటోల నుంచి బ్యాటరీలు

వర్గల్(గజ్వేల్): ఆటోల నుంచి బ్యాటరీలను చోరీ చేస్తున్న వ్యక్తి పోలీసులకు చిక్కాడు. సోమవారం వర్గల్ మండలం సింగాయపల్లి చౌరస్తా వద్ద వాహన తనిఖీ చేస్తుండగా బ్యాటరీలతో సహా దొరికిపోయాడు. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. వర్గల్ మండలం వర్గల్, నగరం తండాలో శనివారం, ఆదివారం రాత్రి వేళల్లో ఆటోల బ్యాటరీలు దొంగతనం జరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు గౌరారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సోమవారం ఉదయం సింగాయపల్లి చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. హైదరాబాద్‌లోని న్యూబోయిన్‌పల్లి గణేశ్ నగర్‌కు చెందిన కారు డ్రైవర్ పేరాల యాదగిరి కారును ఆపి తనిఖీ చేయగా డిక్కీలో ఆటో బ్యాటరీలు బయటపడ్డాయి. వెంటనే అదుపులోకి తీసుకొని విచారించగా శామీర్‌పేట పీఎస్ పరిధిలో ఒక బ్యాటరీ, ములుగు పీఎస్ పరిధిలో 9, గౌరారం పీఎస్ పరిధిలో 3 బ్యాటరీలు దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. ఈ మేరకు నిందితుని అరెస్ట్ చేసి కోర్టులో రిమాండ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దోపిడీకి గురైన సొమ్మెవరిది?

- మెదక్ విజయ డెయిరీ మేనేజర్ ఇంట్లో రూ.24 లక్షలు చోరీ
- 15 రోజులైనా కేసు పెట్టకపోవడంపై అనుమానాలు



హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ విజయ పాల డెయిరీ మేనేజర్ రజిత ఇంట్లో రూ.24 లక్షలు చోరీకి గురైనా పోలీసు కేసు పెట్టకపోవడం పట్టణ కేంద్రంలో చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. మెదక్ విజయ డెయిరీ మేనేజర్ రజిత తన డెయిరీ ఫామ్‌లో పని చేసేందుకు హవేళిఘణాపూర్ మండలం తొగిట గ్రామానికి 17 ఏళ్ల దుర్గాప్రసాద్‌తోపాటు కిషన్, కృష్ణ, శేఖర్‌లను నియమించుకుంది. గత నెలలో దుర్గాప్రసాద్ తన ఇంట్లో రూ.24 లక్షలు దొంగతనం చేశాడని ఆరోపించింది. ఈ విషయమై బాలుడి తల్లిదండ్రులను పిలిపించి డబ్బులు ఇవ్వాలని అడుగగా, ఈ విషయం ఎవరికి చెప్పొద్దని డబ్బులు చెల్లిస్తామని వారితో ఒప్పంద పత్రం రాసుకున్నట్లు తెల్సింది. దుర్గాప్రసాద్ మాత్రం రూ.8 లక్షలు దొంగిలించినట్లు ఒప్పుకున్నట్లు తెల్సింది. ఆమె మాత్రం దుర్గాప్రసాద్ అన్న కరుణాకర్ పేరున వేతనం చెల్లిస్తూ కార్యాలయ పనులే కాకుండా వ్యక్తి గత పనులను కూడా చేయించుకుంటుందని దుర్గాప్రసాద్ వాపోయాడు. దొంగిలించిన డబ్బులో నుంచి దుర్గాప్రసాద్ మిగితా ముగ్గురికి రూ.లక్ష చొప్పున ఇచ్చినట్లు సమాచారం. దొంగతనం జరిగి 15 రోజులు అవుతున్నా మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంపై ఆ డబ్బు ఎక్కడిదని పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయంపై మేనేజర్ రజితను వివరణ కోరగా ఇది చాలా చిన్న విషయమని, నా పర్సనల్ అని, పెద్ద చేయడం అవసరమా..? లైట్ తీస్కోండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

డ్రగ్స్ తరలిస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అరెస్ట్


పట్టుబడిన నిందితుడితో అధికారులు

సంగారెడ్డి జోన్: అక్రమంగా డ్రగ్స్ తరలిస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను పోలీసులు పట్టుకున్నారు. డీటీఎఫ్, ఎక్సైజ్ పోలీసుల కథనం మేరకు.. జమ్మూకాశ్మీర్‌కు చెందిన హర్షత్ సింగ్ (35) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. డ్రగ్స్‌కు అలవాటు పడిన సింగ్ ఉద్యోగంలో వస్తున్న జీతామంతా వాటికే ఖర్చు చేసేవాడు. ఈ క్రమంలోనే డ్రగ్స్ వ్యాపారిగా మారి తోటి ఉద్యోగులకు, ఇతరులకు డ్రగ్స్‌ను సరఫరా చేసే స్థాయికి ఎదిగాడు. సోమవారం పూణే నుంచి హైదరాబాద్‌కు వాహనంలో డ్రగ్స్ తీసుకొస్తుండగా సంగారెడ్డి డీటీఎఫ్, ఎక్సైజ్ పోలీసులు సంగారెడ్డి పరిధిలోని మల్కాపూర్ ఫ్లై ఓవర్ వద్ద అతడి వాహనాన్ని తనిఖీ చేశారు. వాహనంలో 120 మిల్లీ గ్రాముల డ్రగ్స్ లభించింది. పట్టుకున్న డ్రగ్స్‌తోపాటు వాహనం విలువ రూ.21.06 లక్షలు ఉంటుందని ఎక్సైజ్ సూపరిండెంట్ కె.శ్రీనివాసరావు తెలిపారు. సమావేశం లో సీఐ సీహెచ్. చంద్రశేఖర్, ఎస్సైలు బీ.యాదయ్య, జీ.హన్మంత్, పీ.శ్రీనివాసరెడ్డి, కానిస్టేబుల్ ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు. డ్రగ్స్‌ను పట్టుకున్న డీటీఎఫ్, ఎక్సైజ్ పోలీసులను ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాస రెడ్డి, మెదక్ డిప్యూటీ కమిషనర్ హరికిషన్ అసిస్టెంట్ కమిషనర్ జీ.శ్రీనివాసరెడ్డి అభినందించారు.

పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం

- ఏడుగురికి తీవ్ర గాయాలు, ఒకరి పరిస్థితి విషమం
- బొల్లారం పారిశ్రామిక వాడలో ఘటన

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం బొల్లారం పారిశ్రామిక వాడలోని శ్రీకర ఆర్గానిక్స్ పరిశ్రమలో సోమవారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి కథనం మేరకు.. పరిశ్రమలోని సెంటర్ పీస్ వద్ద అధిక ఒత్తిడి కావడంతో పేలుడు సంభవించింది. ప్రమాదం జరిగిన బ్లాక్ లో 10 మంది కార్మికులు విధులు నిర్వహిస్తుండగా ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మదీనాగూడలోని అర్చన ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో బిజేష్, పుష్పరాజ్, సుందర్ సింగ్, చాంద్ ప్రతాప్, షైక్ అన్వర్, నీలేష్ సింగ్ ఉన్నారు. ఈశ్వర్ చంద్ర ఆగారియా పరిస్థితి విషమంగా ఉంది. వీరంతా మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కార్మికులుగా పోలీసులు తెలిపారు.

సత్యాన్ని చెరపలేరు..

రంగనాయక సాగర్ జల దృశ్యంపై హరీశ్‌రావు ట్వీట్

సిద్దిపేటజోన్: కాళేశ్వరం జలాలతో నిండు కుండలా మారిన సిద్దిపేట జిల్లా రంగనాయక సాగర్ ఫొటో సోషల్ మీడియాలో సోమవారం వైరల్ అయింది. దీంతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తన ట్విట్టర్ ద్వారా కాళేశ్వరంపై, నీటితో నిండిన రిజర్వాయర్ పై ట్వీట్ చేశారు. వందలాది కిలోమీటర్లు ప్రయాణించి రంగనాయక సాగర్‌కు చేరిన గోదారి జలాలలు సృష్టించిన అపురూప దృశ్యమని, అద్భుత జలసౌందర్యంగా ఆయన అభివర్ణించారు. కాళేశ్వరాన్ని బద్నాం చేస్తున్న వావారు ఈ సుందర దృశ్యాన్ని చూడండని హరీశ్‌రావు అన్నారు.


జపాన్ ప్రతినిధులతో విద్యార్థులు, సిబ్బంది

జపాన్ ఒప్పందంతో విద్యార్థులకు మేలు

నర్సాపూర్: జపాన్‌కు చెందిన యూనివర్సిటీతో తమ కాలేజీకి ఒప్పందం కుదరడం ఇక్కడి కోర్ గ్రూప్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ విష్ణురాజు తెలిపారు. జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ, జపాన్ స్పాన్సర్ చేసిన ప్రెస్టీజియస్ సకురా సైన్స్ ఎక్సేంజ్ ప్రోగ్రాంలో పాల్గొనేందుకు స్థానిక బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీ మెకానికల్, కెమికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు, ఫ్యాకల్టీ సభ్యులు ఎంపిక కావడంపై చైర్మన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోర్ ఇంజనీరింగ్ విద్యార్థులు అంతర్జాతీయ పరిశోధన అవకాశాలను అన్వేషించడానికి, వారి సాంకేతిక నైపుణ్యాలు మెరుగుపర్చుకునేందుకు అగ్రశ్రేణి కోర్ కంపెనీల్లో మంచి కెరీర్ కోసం సిద్ధ కావడానికి ఈ అవకాశం ఉపయోగపడుతుందన్నారు. కాగా సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, సెక్రటరీ ఆదిత్య విస్సం విద్యార్థులను అభినందించారు. కాలేజీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ.. జపాన్‌కు చెందిన కుమమోటో యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ శుచిటోరీ మార్గదర్శకత్వంలో తమ కాలేజీ విద్యార్థులు, ఫ్యాకల్టీగా పని చేస్తారని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


అనిల్ (ఫైల్)

ములుగు(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన ములుగు మండలం జప్తి సింగాయిపల్లి గ్రామ శివారులో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. ములుగు మండలం క్షీరసాగర్ గ్రామానికి చెందిన గంగమ్మ అనిల్(18) బైక్‌పై వంటిమామిడి వైపు వెళ్తున్నాడు. జప్తిసింగాయిపల్లి గ్రామ శివారులోకి రాగానే ఎదురుగా వస్తున్న అశోక్ లీలాండ్ వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అనిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బ్రిడ్జిపై నుంచి కిందపడ్డ లారీ

ఇద్దరికి తీవ్ర గాయాలు


బ్రిడ్జి కింద బోల్తా పడ్డ లారీ

వట్‌పల్లి (అందోల్): బ్రిడ్జిపై నుంచి లారీ కిందపడటంతో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన అందోల్ మండల పరిధిలోని నాందేడ్-అకోలా జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కర్నూల్ జిల్లా బేతంచర్ల నుంచి బండల లోడ్‌తో రాజస్థాన్ వెళ్తున్న లారీ సంగుపేట బ్రిడ్జి వద్దకు చేరుకోగానే అదుపుతప్పి బ్రిడ్జి పైనుంచి కింద పడింది. లారీ డ్రైవర్ ముందు భాగంలోని క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. అటువైపుగా వెళ్తున్న ప్రయాణికులు ప్రమాద ఘటనపై జోగిపేట పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ పాండు ఆధ్వర్యంలో పోలీసులు చేరుకొని తీవ్ర గాయాలైన డ్రైవర్ షకీర్‌ను బయటకు తీసి జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్లీనర్ ధర్మేందర్ గాయాలతో బయటపడ్డాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కలిసికట్టుగా హక్కులను సాధించుకుందాం

- సేవా కార్యక్రమాల్లో ముందుండాలి
- తెలంగాణ పద్మశాలీ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కలిసి ఉండి మనకు రావాల్సిన హక్కులను సాధించుకుందామని, తెలంగాణ పద్మశాలీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు అన్నారు. తెలంగాణ పద్మశాలీ ఉద్యోగుల సంఘం సిద్దిపేట జిల్లా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ ప్రమాణ స్వీకారం స్థానిక మార్కండేయ ఆలయ ఆవరణలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లాలోని పద్మశాలీల సంక్షేమం కోసం ఏర్పాటు చేసుకున్న ఈ సంఘంను ప్రతీ ఒక్క పద్మశాలీ కుల బాంధవులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సేవా కార్యక్రమాల్లో పద్మశాలీ ఉద్యోగ సంఘ సభ్యులు ముందుండాలన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి తిరందాస్ యాదగిరి మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం విద్యార్థులకు పురస్కారాలు, ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు, పేదవారిని ఆదుకోవటం లాంటి కార్యక్రమాలతో పాటు అన్ని జిల్లాల్లో మ్యారేజ్ బ్యూరో లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మామిడ్యాల రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి వాసుదేవ్, యాదగిరేందర్, నవీన్, రాజ్ కుమార్, ఉష, రాజేందర్, బూర మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి రోడ్డు ప్రమాదంలో..

- పటాన్‌చెరు దంపతులు మృతి
- ముగ్గురు పిల్లలకు తీవ్ర గాయాలు
- పుణ్యక్షేత్రాల దర్శనానికి వెళ్లగా ఘటన

పటాన్‌చెరుటౌన్: తిరుపతిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పటాన్‌చెరుకు చెందిన ఇద్దరు దంపతులు మృతి చెందగా, వారి ముగ్గురు పిల్లలకు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో పటాన్‌చెరు మండంలో తీవ్ర విషాదం అలుముకుంది. మృతుల బంధుల కథనం మేరకు.. పటాన్‌చెరు సీతారామపురం కాలనీలో ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న సందీప్ షా (35), భార్య అంజలీ దేవి(31), వారి 12 ఏళ్లలోపు ముగ్గురు పిల్లలు లిఖితా షా, సోనాలి షా, రుద్రప్రతాప్ షాతోపాటు అతడి స్నేహితుడు నరేశ్‌ను తీసుకొని 16వ తేదీన తిరుమలకు దర్శనం కోసం వెళ్లారు. అనంతరం మరికొన్ని పుణ్యక్షేత్రాలు దర్శించుకొని సోమవారం కారులో తిరుగు ప్రయాణమయ్యారు. రేణిగుంట- రైల్వేకోడూరు కుక్కల దొడ్డి గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వీరి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సందీప్ షా, అతని భార్య అంజలీ ఇద్దరూ మృతి చెందారు. ముగ్గురు పిల్లలకు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను అక్కడే స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రికి తరలించారు. మృతుడు సందీప్ బంధువు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రేణిగుంట పోలీసులు కేసు నమోదు చేశారు.

మానసిక ఒత్తిడితో విద్యార్థిని ఆత్మహత్య

పదిలో ఉత్తీర్ణత సాధించలేనేమోనని బలవన్మరణం


సహస్ర(ఫైల్)

తూప్రాన్: మానసిక ఒత్తిడితో విద్యార్థిని ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన పట్టణ కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ యాదగిరి కథనం మేరకు.. పట్టణానికి చెందిన గుర్రప్పగారి సుధాకర్, మమత దంపతులకు ఇద్దరు కుమార్తెలు. సుధాకర్ కూలీ పనులు చేస్తుండగా తల్లి బీడీలు చుడుతూ జీవనం సాగిస్తున్నారు. వీరి పెద్ద కూతురు ఇంటర్ చదువుతోంది. రెండో కూతురు సహస్ర(15) పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతోంది. చదువుల్లో వెనుకంజలో ఉన్నందున, కుటుంబ సభ్యులు బాగా చదివి త్వరలో జరుగనున్న వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఉదయం తండ్రి కూలి పనులకు వెళ్లగా తల్లి బీడీలు ఇచ్చేందుకు వెళ్లింది. పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేనేమోనని మానసిక ఒత్తిడితో ఇంట్లో ఎవరూ లేని సమయంలో సహస్ర చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అరగంట తర్వాత తల్లి వచ్చి చూసేసరికి గదిలో వేలాడుతూ కనిపించింది. దీంతో కుటుంబంలో విషాదం అలుముకుంది. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భార్య కాపురానికి రావడం లేని యువకుడు

సిద్దిపేటకమాన్: భార్య కాపురానికి రావడం లేదని మనోవేదనతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట వన్ టౌన్ సీఐ వాసుదేవరావు కథనం మేరకు.. సిద్దిపేట పట్టణం ఇమాంబాద్‌కు చెందిన శివరాత్రి చంటి (21)కి ఏడాదిన్నర కిందట వివాహం జరిగింది. నాలుగు నెలలుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. పెద్దల సూచన మేరకు చంటి కాపురాన్ని పట్టణంలోని రేణుకానగర్‌కు మార్చాడు. పది రోజుల కిందట భార్యాభర్తల మధ్య మళ్లీ గొడవ జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి ఆమెను తీసుకురావడానికి ప్రయత్నించినా రాలేదు. దీంతో ఆదివారం రాత్రి రేణుకానగర్‌లోని ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉరేసుకొని యువకుడు


వీరప్రసాద్ (ఫైల్)

జిన్నారం (పటాన్‌చెరు): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి కథనం మేరకు.. జిన్నారం మండలం గడ్డపోతారం గ్రామపంచాయతీ పరిధిలోని కిష్టయ్య పల్లి గ్రామానికి చెందిన కొడకంచి లక్ష్మణ్ కుమారుడు వీరప్రసాద్ (20) సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయంపై సీఐని వివరణ కోరగా మృతుడి కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు రాలేదని, మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

తల్లిదండ్రులు మందలించారని యువతి..

దుబ్బాకటౌన్: వివాహం జరిగిన వ్యక్తిని ప్రేమించిందని తల్లిదండ్రులు మందలించడంతో యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. సోమవారం రాయపోల్ పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని వడ్డేపల్లి గ్రామానికి చెందిన గుండారం అంజలి(20) అదే గ్రామానికి చెందిన అయ్యగల్ల నాగరాజుతో ప్రేమలో పడి 3 నెలల కిందట ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. అప్పటికే నాగరాజుకి వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూతురు కనిపించడం లేదని అంజలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొద్దిరోజుల తర్వాత అంజలి నాగరాజు పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. గ్రామస్తులు, కుటుంబ సమక్షంలో ఇద్దరికీ కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. ఇటీవల మళ్లీ ఇద్దరూ ఫోన్ మాట్లాడుతుండటంతో అంజలిని తల్లిదండ్రులు మందలించారు. ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన యువతి మధ్యాహ్నం భోజనం చేయడానికి ఇంటికొచ్చి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి తండ్రి బీరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.